

నిర్ణయమే ప్రధాన సమస్య

బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం సేకరించే భూమికి పరిహారం చెల్లింపుపై అధికారులు నిర్ణయానికి రాలేకపోతున్నారు.

- 8లో ▸



ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

ఎగువ ప్రాంతాల నుంచి ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో తగ్గింది. శుక్రవారం 52వేల క్యూసెక్కులు రాగా, శనివారం 26వేలకు తగ్గింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

31.2 /24.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎన్నికల కమిషనర్‌కు కలెక్టర్ స్వాగతం



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి శనివారం జిల్లా కేంద్రానికి రాగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆయనకు స్వాగతం పలికారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కమిషనర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అదజేశారు. అంతకు ముందు కమిషనర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): వికలాంగత్వ నిర్ధారణ కోసం జిల్లాలో ఈనెలలో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 21, 28 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 4న ఉదయం 11:30గంటలకు మీ సేవాకేంద్రాల్లో సదరం స్లాట్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత తేదీల్లో మెడికల్ రిపోర్టులు, ఆధార్ కార్డు, మీ సేవ రసీదును వెంట తీసుకుని సదరం క్యాంపునకు హాజరుకావాలని ఆయన సూచించారు.

7న దివ్యాంగులకు పరికరాల పంపిణీ

నిజామాబాద్‌అర్బన్: దివ్యాంగులకు అవసరమైన పరికరాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న పంపిణీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న న్యూ ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న శిబిరానికి 18 ఏళ్లలోపు దివ్యాంగులు హాజరుకావాలని, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువపత్రం, రేషన్‌కార్డుతోపాటు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు.

వ్యవసాయ శాఖలో బదిలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయ శాఖలో శనివారం ఉద్యోగ బదిలీలు జరిగాయి. హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా చేపట్టిన బదిలీ కౌన్సెలింగ్‌లో జిల్లా నుంచి 30మందికి పైగా ఏఈవోలు పాల్గొన్నారు. వీరు జిల్లా స్థాయిలోనే బదిలీలు కోరుకోగా, వేరే జిల్లాల నుంచి జిల్లాకు ఎనిమిది మంది ఏఈవోలు బదిలీపై రానున్నారు. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే రానున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు.

వ్యవసాయ కనెక్షన్‌లు 28 శాతం వృద్ధి

నిజామాబాద్‌నాగారం: రైతులకు త్వరితగతిన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని జిల్లా విద్యుత్ శాఖాధికారి రాపెల్లి రవీందర్ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది 8 నెలల్లో 2022 డిసెంబర్ 1 నుంచి 2023 జూలై 7 వరకు 2374 సర్వీసులను మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది 2023 డిసెంబర్ 1 నుంచి 2024 జూలై 31 వరకు 3038 సర్వీసులను మంజూరు చేసినట్లు తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే 664 (28 శాతం) సర్వీసుల మంజూరు పెరిగిందన్నారు. సర్వీసుల మంజూ రు ఆన్‌లైన్ చేయడం ద్వారా ఆలస్యం జరగడం లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని, వంగిన విద్యుత స్తంభాలను, లూస్ లైన్‌లను సరి చేస్తున్నామన్నారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువ కాగా సమస్యలను పరిష్కరించే దిశగా పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టా మని రాపెల్లి రవీందర్ తెలిపారు.

అయ్యప్ప కలిపి 35 ఏళ్లు



ధన్‌పాల్ సూర్యనారాయణ, జ్ఞానేందర్

జిల్లా కేంద్రానికి చెందిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రముఖ వ్యాపారి, సామాజిక సేవకుడు మంచాల జ్ఞానేందర్ స్నేహబంధానికి 35 ఏళ్లు. అయ్యప్ప దీక్ష సమయంలో వారిద్దరు మొదటిసారి కలిశారు. ఆ తర్వాత మరో 14 ఏళ్లపాటు అయ్యప్ప మాల ధరించడంతో వారి మధ్య స్నేహం ధృడమైంది. ఇరువురి కుటుంబాలూ దగ్గరయ్యాయి. స్వతహాగా వ్యాపారవేత్త అయిన ధన్‌పాల్ సూర్యనారాయణ తన తల్లిదండ్రుల పేరుతో సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తుండగా, ఆయనను ఆదర్శంగా తీసుకుని మంచాల జ్ఞానేందర్ కూడా తన తండ్రి పేరుతో ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మంచి, చెడు ఏ విషయమైనా ఇరువురు పంచుకుంటారు. ప్రస్తుతం ధన్‌పాల్ సూర్యనారాయణ అర్బన్ ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా, మంచాల జ్ఞానేందర్ కూడా రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు.

కళ్ల ముందే ఆ మధుర క్షణాలు



ఖలీల్‌వాడి: చదువులో ప్రోత్సాహించి డిగ్రీ వరకు అండగా నిలిచిన స్నే హితుడు మత్తారెడ్డితో గడిపిన మధురక్షణాలు ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతున్నాయి. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన మత్తారెడ్డి, నేను మంచి స్నేహితులం. మూడేళ్ల క్రితం నా స్నేహితుడు మత్తారెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. ప్రతిరోజూ ఏదో ఓ సందర్భంలో మత్తారెడ్డి గుర్తుకొస్తూనే ఉంటాడు.

– విజయ్‌బాబు, ఎస్‌హెచ్‌వో, ఒకటో టౌన్

చిన్ననాడు చిగురించిన స్నేహం కలకాలం కొనసాగుతుందని, కష్టసుఖాల్లో తామంతా కలిసి ఉంటామని నిరూపిస్తున్నారు ఈ స్నేహితులు. స్కూళ్లు, కళాశాలల్లో, ప్రత్యేక పరిస్థితుల్లో తమ మధ్య అయిన పరిచయం ప్రాణస్నేహంగా మారిందంటున్నారు. తాము ఎంచుకున్న రంగమేదైనా ఆలోచనలు, అభిప్రాయాలు మాత్రం ఒక్కటేనని అంటున్నారు. తమలో ఎవరికైనా కష్టం వస్తే ఆ కష్టాన్ని తమదిగా భావిస్తూ అండగా నిలవడంతోపాటు సమాజహితానికీ కృషి చేస్తున్నారు. కొందరు ట్రస్టులు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతుండగా, మరి కొందరు అవసరాన్ని బట్టి పాఠశాలలకు, స్వచ్ఛంద సంస్థలకు, ఆపదలో ఉన్న వారికి తమ ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు స్నేహితుల మధ్య బంధంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సుభాష్‌నగర్/ నిజామాబాద్‌అర్బన్/ ఖలీల్‌వాడి/ రెంజల్/వర్ని



కలకాలం కొనసాగనీ ఈ స్నేహం

- ఆపదలో అండగా నిలుస్తున్న మిత్రులు
- ఆలోచనలు, అభిప్రాయాలు ఒక్కటిగా ముందుకు సాగుతూ..
- సాటి వారిని ఆదుకుంటూ.. సామాజిక సేవలో తరిస్తున్న స్నేహితులు
- నేడు స్నేహితుల దినోత్సవం



వాకింగ్‌లో బలపడిన స్నేహం

నిజామాబాద్‌అర్బన్: ఆరోగ్యం కోసం చేసే వాకింగ్ వారిని స్నేహితులుగా మార్చింది. ఆ స్నేహం వారి కుటుంబాలను కలిపింది. ఎనిమిది మంది స్నే హితులు.. వారి కుటుంబ సభ్యులు ఫ్యామిలీ ఫ్రెండ్స్ అయ్యారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ ఆదర్శనీయ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. నగరశివారులోని ముబారక్‌నగర్‌లో నివాసముంటున్న ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్. వినయ్‌కుమార్, ప్రభాకర్, శ్రీకాంత్, ప్రభుత్వ ఉపాధ్యాయులు రమేశ్, లక్ష్మణ్‌తో పాటు ఓ ప్రైవేట్ ఉద్యోగి మొత్తం ఎనిమిది మంది వాకింగ్ స్నేహితులుగా కలిశారు. ఆరేళ్ల క్రితం వీరి మధ్య మొదలైన స్నేహం ఫ్యామిలీ ఫ్రెండ్స్‌గా మారింది. ఉద్యోగాలు, పిల్లల చదువుల కోసం జిల్లా కేంద్రంలో స్థిరపడిన వీరు కుటుంబ సభ్యులకు, బంధువులకు దూరంగా ఉంటున్నప్పటికీ.. ఆ లోటు కనిపించదు. ఎనిమిది కుటుంబాలు ఒకే ఫ్యామిలీగా ఉంటూ సుఖసంతోషాలను పంచుకుంటున్నారు.



హార్ట్‌ఫుల్ యువర్స్ సంస్థ సభ్యులు

'హార్ట్‌ఫుల్ యువర్స్' స్నేహితులు


హార్ట్‌ఫుల్ యువర్స్ సంస్థను ఏర్పాటు చేసిన నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన 15మంది మహిళలు 30 ఏళ్లుగా తమ స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నారు. పద్మ, సుజాత, జలజ, కవిత, స్వరూప, మంచాల శ్రీలక్ష్మీ, గీత, మాధవి శాంతి, సుజాత, అనిత, శారద, అరుంధతి, లత, భాగ్యలక్ష్మి ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆనందమైనా, ఆపదైనా ఒకరికి మరొకరు తోడుగా ఉంటారు. ముఖ్యంగా బతుకమ్మ, దసరా, బోనాలు, ఇతరాత్ర పండుగలను సభ్యులందరూ కలిసి జరుపుకుంటారు. ప్రతినెలా తప్పకుండా కలిసి అన్ని విషయాలను పంచుకుంటారు. మహిళల మధ్య స్నేహబంధం 30 ఏళ్లు కొనసాగడం చాలా అరుదు. పెళ్లిళ్లు, భర్త వ్యాపార, ఉద్యోగ రీత్యా, వివిధ ప్రాంతాలకు బదిలీ అవుతుంటారు. అయినప్పటికీ తమ స్నేహాన్ని మరువకూడదనే ఉద్దేశంతో ప్రతినెలా వీరు కలుస్తుంటారు.

ఆపదొస్తే అండగా నిలుస్తున్నారు



తమతోపాటు చదువుకున్న స్నేహితులకు ఏ ఆపద వచ్చినా మిగతా వారందరూ అండగా నిలుస్తున్నారు. రుద్రూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న (1987 – 88బ్యాచ్) స్నేహితులు 58 మంది 2016లో సమావేశమై పలు తీర్మానాలు చేసుకున్నారు. స్నేహితుల్లో ఏ ఒక్కరికి ఆపదవచ్చినా అండగా నిలువాలని, ఆర్థికంగా వెనుకబడిన స్నేహితుల ఇళ్లలో పెళ్లిళ్లు జరిగితే ఆర్థికసాయం అందజేయడంతో పాటు పెళ్లి దగ్గరుండి జరిపించాలని నిర్ణయించారు. అలాగే తాము విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు అండగా నిలవాలని తీర్మానం చేశారు. అనుకున్నట్టుగానే తాము చదువుకున్న పాఠశాలలో సౌకర్యాలు కల్పించడంతోపాటు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. పెద్ద వీరయ్య, గజ్జారి లక్ష్మణ్, బందెల పోశెట్టి అకాల మరణం చెందగా.. వారి కుటుంబాలకు అండగా నిలిచారు. గత ఎనిమిదేళ్లుగా ప్రతి ఏడాది గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకుని కలుసుకుంటున్నారు.

ప్రొఫెసర్ - బ్యాంక్ మేనేజర్



సేర్ల దయానంద్, గడ్డం ధీరేందర్‌రెడ్డి

జిల్లా కేంద్రానికి చెందిన సేర్ల దయానంద్, గడ్డం ధీరేందర్‌రెడ్డి.. ఇద్దరివి వేర్వేరు రంగాలైనా ఆలోచన, అభిప్రాయం మాత్రం ఒక్కటే. 59 ఏళ్ల స్నేహంలో ఒకే మాట, ఒకే బాటగా సాగుతున్నారు. జిల్లా కేంద్రంలోని నూతన వైశ్య పాఠశాల (మాణిక్‌భవన్)లో ఆరో తరగతి నుంచి హెచ్‌ఎస్‌సీ, ఆ తరువాత జీజీ కళాశాలలో బీకాం, ఇతర కళాశాలల్లో ఉన్నత చదవులను కలిసే చదువుకున్నారు. రూమ్‌మేట్స్ అయిన వీరిరువురూ విభిన్న రంగాల్లో ఉద్యోగాలు చేశారు. దయానంద్ ప్రొఫెసర్‌గా, ధీరేందర్‌రెడ్డి ఆంధ్రాబ్యాంకు మేనేజర్‌గా రిటైర్ అయ్యారు. విశ్రాంత జీవితాన్ని నిజామాబాద్‌లో గడుపుతున్న ఈ స్నేహితులు శబ్ద తరంగిణి అనే సంస్థను ఏర్పాటు చేశారు. మొక్కలు నాటడం నుంచి భగవద్గీతల పంపిణీ వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ కలిసి వాకింగ్ చేసే వీరిద్దరు ధ్యానం, యోగా తరగతులకు హాజరవుతున్నారు.

కరోనా కబళించినా స్నేహితులు అండగా నిలిచారు



తమ స్నేహితుడిని కరోనా కబళించిందని తెలుసుకుని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు ఆ స్నేహితులు. రెంజల్ హై స్కూల్‌లో చదువుకున్న (1992 – 93) విఠల్‌రెడ్డి కరోనా కారణంగా మృతి చెందగా, స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయనతో కలిసి చదువుకున్న వారు నిర్ణయించుకున్నారు. తలాకొంత పోగేసి రూ.2.50లక్షలను బాధిత కుటుంబానికి ఆరు నెలల క్రితం అందజేశారు. విఠల్‌రెడ్డికి ఇద్దరు ఆడపిల్లలు కాగా, వారి పెళ్లిళ్ల సమయంలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందజేస్తామని భరోసా ఇచ్చారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- నూతన ఆర్‌వోఆర్ బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణ
- వీసీలో సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి శనివారం ఆయన కలెక్టర్‌తో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లు– 2024పై ప్రజలు తమ సలహాలు, సూచనలను ఇచ్చేందుకు సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ (www.ccla.telangana.gov.in) ద్వారా అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. 2నుంచి 23వ తేదీ వరకు ముసాయిదా బిల్లుపై ప్రజలు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయొచ్చని, ఈ మెయిల్ (ror 2024& rev@telangana.gov.in) లేదా పోస్ట్ ద్వారా కూడా 'ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్‌ఏ కార్యాలయం, నాంపల్లి, స్టేషన్ రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, అబిడ్స్, హైదరాబాద్ 500001 చిరునామాకు పంపించాలని సూచించారు.

అనంతరం తహసీల్దార్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడారు. సీసీఎల్‌ఏ కమిషనర్ సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలో పెండింగ్ దరఖాస్తులను వారం, పది రోజుల్లోగా క్లియర్ చేయాలని గడువు విధించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి డేటా కరెక్షన్ దరఖాస్తులను పరిష్కరించాలని, ఈ ప్రక్రియను రోజువారీగా పరిశీలించాలని ఆర్డీవోలకు సూచించారు. రాష్ట్రస్థాయి ప్రజావాణి అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేస్తామని, వాటిని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. ఏదైనా అర్జీని తిరస్కరిస్తే, అందుకు గల కారణాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్రహం

- మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న నగర మేయర్ నీతూకిరణ్



పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కమిషనర్ మంద మకరందు, కౌన్సిల్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ చీఫ్, మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు దివంగత ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) విగ్రహాన్ని నగరంలోని కంఠేశ్వర్ బై పాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ నగర పాలక సంస్థ పాలకవర్గం ప్రత్యేక సమావేశంలో తీర్మానించింది. శనివారం కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మేయర్ నీతూకిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎస్ మరణానికి నివాళులు అర్పిస్తూ, మౌనం పాటించారు. మేయర్ మాట్లాడుతూ ధర్మపురి శ్రీనివాస్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు చేసిన కృషి, నగర అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ డీఎస్ రాష్ట్ర రాజకీయాలలో తనదైన శైలిలో ప్రజలకు ఎంతో సేవ చేశారని, నగర అభివృద్ధికి దోహదపడ్డారని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ డీఎస్ గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ ఇచ్చిన అభ్యర్థన మేరకు కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రవేశపెట్టిన తీర్మానం సభ్యుల మద్దతుతో ఆమోదం పొందినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపాల్ కమిషనర్ మంద మకరంద్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి రూ.10 కోట్లు

- ఎస్‌డీఎఫ్ కింద నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రూ.50 కోట్లు

మోర్తాడ్(బాల్కొండ): అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక అభివృద్ధి గ్రాంటు (ఎస్‌డీఎఫ్) కింద ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రభుత్వం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రూ.50 కోట్లు విడుదల చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఈ నిధుల కేటాయింపును ప్రకటించగా సాంకేతిక కారణాలతో మంజూరు చేయలేదు. ఇటీవల నిధులను విడుదల చేయగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమోదంతోనే గ్రామాలు, పట్టణాల్లో ఎస్‌డీఎఫ్ నిధులను ఖర్చు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులలో పేర్కొంది. ఎస్‌డీఎఫ్ నిధులను వినియోగించే విషయంలో ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పూర్తి అధికారం కట్టబెట్టారు.

దీంతో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జులే నిధుల కేటాయింపు జాబితాలను సిద్ధం చేసి మంత్రి ముందు ఉంచే అవకాశం ఉంది. జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్‌లలో బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలలోనే కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు ఉన్నారు. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్‌లలో నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జులే నిధుల కేటాయింపులకు సంబంధించిన సూచన చేయనున్నారు. పార్టీ నేతలు సూచించిన పనులకే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తెలిపి సాంకేతిక అనుమతిని ఇవ్వాలని అధికారులను ఆదేశించనున్నారు. కాగా జిల్లాకు రూ.50 కోట్ల నిధులు విడుదల కావడంతో వీటిని వినియోగించి అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్ల అవతారమెత్తిన నాయకులు ఉబలాటపడుతున్నారు. నిధుల కేటాయింపులో ఎలాంటి పనులకు ప్రాధాన్యత ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఎల్లమ్మకుంటలో వైద్యశిబిరం

- 44 మంది రక్తనమూనాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఈనెల 1న 'సాక్షి'లో ప్రచురితమైన 'మంచం పట్టిన ఎల్లమ్మకుంట' కథనానికి వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. శనివారం ఎల్లమ్మకుంట గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ముదక్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్‌రెడ్డి, వైద్యులు శరత్‌చంద్ర, కె అంకిత ఆధ్వర్యంలో 80 మందిని పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కీళ్లనొప్పులు, జ్వరంతో బాధపడుతున్న 44 మంది రక్త నమూనాలను సేకరించి, ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. గ్రామంలో కలుషిత నీరు తాగుతుండటం వల్లే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని గుర్తించామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామ స్తులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో భూలక్ష్మీ, హెచ్‌ఏలు అనసూయ, సుజాత, సునీ త, పంచాయతీ కార్యదర్శి అఖిలేశ్‌పటేల్, ఎల్‌టీలు, ఆశావర్కర్లు, సిబ్బంది రాజేందర్, సురేశ్, శ్రీనివాస్, లక్ష్మీబాయి, వసంత, స్వరూప, కవిత, శాంతాకుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ నాగమోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ 8, అసోసియేట్ ప్రొఫెసర్ 9, అసిస్టెంట్ ప్రొఫెసర్ 14, ట్యూటర్ 3, జూనియర్ రెసిడెంట్ 18, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 10 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ సాయంత్రం 4 వరకు దరఖాస్తులను వైద్య కళాశాలలో స్వీకరిస్తామన్నారు. 13న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 14న ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు www.gmcnzb.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

నీట్‌లో నిశితరెడ్డికి 5391 ర్యాంకు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన నిశితరెడ్డి నీట్ ఫలితాల్లో ఆలిండియా ఈడబ్ల్యూఎస్ మెరిట్ లిస్టులో 5391 ర్యాంకు సాధించింది. ఇంటర్ బైపీసీలో రాష్ట్ర మూడో ర్యాంకు సాధించింది. నిశితరెడ్డి రెడ్డి నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పలువురు ఆమెను అభినందించారు.

మోగని ఎస్సారెస్పీ అధికారుల ఫోన్లు..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారుల ప్రభుత్వ ఫోన్లు గత కొంత కాలంగా మోగడం లేదు. దీంతో ఆయకట్టు రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చిచేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం ఆశాజనంగా ఉంది. నీటి విడుదల విషయంలో తెలుసుకుందామనుకుంటే అధికారుల ఫోన్లు పనిచేయడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టునకు భారీ వరదలు వచ్చే సీజన్‌లో అధికారుల మధ్య సమన్వయం కూడా అవసరం ఉంటుంది. ప్రాజెక్ట్ ఎస్‌ఈ నుంచి ఏఈఈ వరకు గల ఫోన్లు మోగడం లేదు. వ్యక్తిగత ఫోన్లకు చేసినా ప్రయోజనం ఉండటం లేదని కొందరు ప్రాజెక్టు సిబ్బంది తెలిపారు. అయితే ప్రభుత్వం ఫోన్ బిల్లులు చెల్లించకపోవడంతోనే ఫోన్‌లు మూగబోయినట్లు తెలుస్తోంది.

13 నుంచి బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ నాల్గో సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 13 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

పరిహారం నిర్ణయమే ప్రధాన సమస్య?

- జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులు
- మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్



నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించనున్న జాతీయ రహదారి



బైపాస్ రోడ్డు కోసం సేకరించనున్న వ్యవసాయ భూమి

మోర్తాడ్: జాతీయ రహదారి63 విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మించేందుకు సేకరించే భూమికి పరిహారం ఎంత చెల్లించాలనే అంశంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ప్రభుత్వం చెల్లించే పరిహారానికి రైతులు చెప్పే ధరకు ఎంతో వ్యత్యాసం ఉండటంతో ఎంత చెల్లించాలని నిర్ధారించడమే ప్రధాన సమస్యగా మారింది. చాలా చోట్ల వ్యవసాయ భూములే నష్టపోతుండగా వెంచర్లకు అనుకూలమైన భూములు ఇందులో ఉండటం గమనార్హం. ఈ భూములను జాతీయ రహదారి విస్తరణకు అప్పగిస్తే రూ.కోట్లలో నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోర్తాడ్, గాండ్లపేట్ రైతులకు చెందిన 30.154 హెక్టార్ల భూమిని బైపాస్‌రోడ్డు కోసం అప్పగించాల్సి వస్తుంది. జాతీయ రహదారి విస్తరణ చేయకుంటే ఇప్పుడు నష్టపోయే భూమిలో ఎక్కువ శాతం వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీలు ఉంది. ఇప్పటికే బైపాస్ రోడ్డు కోసం గుర్తించిన భూమి పరిసరాల్లో ఎన్నో వెంచర్లు వెలిశాయి. ఇళ్ల స్థలాల కోసం విక్రయించిన వ్యవసాయ భూమికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎకరానికి రూ.1.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల ధర చెల్లించారు. ఈలెక్కన ఇప్పుడు నష్టపోయే భూములకు రైతులు ఒక్కో ఎకరానికి రూ.1 కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. భూసేకరణకు సంబంధించి రైతులతో ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్ ఇటీవల సమావేశం నిర్వహించగా అందులో పాల్గొన్న రైతులు పరిహారం విషయంలో మార్కెట్ ధరలను పరిగణలోకి తీసుకోవాలని విన్నవించారు. మోర్తాడ్‌లోని ఒకే సంఘం రైతుల భూములు ఇప్పటికే వరద కాలువ, రైల్వే లైన్ నిర్మాణానికి ప్రభుత్వానికి దారదత్తం అయ్యాయి. ఇప్పుడు తాజాగా జాతీయ రహదారి బైపాస్‌కు అప్పగించాల్సి రావడంతో అనేక మంది రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం నామమాత్రంగా ఉంటే తాము మరో చోట వ్యవసాయ భూమిని కొనలేమని రైతులు పేర్కొంటున్నారు.

ఎక్కువ నిధులు అవసరం

పెర్కిట్ నుంచి జాతీయ రహదారి విస్తరణ కోసం 83.895 హెక్టార్ల భూమిని సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. పరిహారం రైతులు కోరిన విధంగా చెల్లించాలంటే రూ.200 కోట్లకు మించి ఎక్కువ నిధులు భూసేకరణ కోసం కేటాయించాల్సి వస్తుంది. పడిగెల, అంక్సాపూర్, కుకునూర్, దొన్కల్, గాండ్లపేట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లిలోని రైతులే ఎక్కువగా భూమిని నష్టపోతున్నారు. వాణిజ్య పరంగా ఉపయోగించే భూమికి కొంత ఎక్కువ ధర చెల్లించి, వ్యవసాయానికి యోగ్యమైన భూమికి మరో రకమైన ధర చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

మంచి ధర వచ్చేలా చూస్తాం

జాతీయ రహదారి విస్తరణలో భూమి నష్టపోతున్న వారికి మంచి ధర వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. రైతులతో సంప్రదింపులు పూర్తయిన తర్వాత వారి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటాం. ఉన్నతాధికారులకు నివేదిక అందించి నష్టపోతున్న రైతులకు ఎక్కువ పరిహారం అందేలా చూస్తాం.

– రాజుగౌడ్, ఆర్డీవో, ఆర్మూర్

ప్రీతంకు వర్సిటీ నివాళులు



ప్రీతం మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్



సాంగ్విలో ప్రీతం అంతిమయాత్ర

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ విద్యార్థి బేదోడ్కర్ ప్రీతం(27) శుక్రవారం కామారెడ్డిలో ఆటో బోల్తాపడి మృతిచెందాడు. శనివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో అతని స్వగ్రామం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సాంగ్వి గ్రామానికి తరలించారు. మార్గమధ్యలో డిచ్‌పల్లి తెయూ మెయిన్ గేట్ వద్ద అంబులెన్స్‌ను ఆపి రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ప్రీతం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతదేహాన్ని తీసుకెళ్తున్న ప్రీతం మేనమామను రిజిస్ట్రార్ ఓదార్చారు. అనుకోని ప్రమాదంలో విద్యార్థి మృతిచెందడం తనను కలిచివేసిందని రిజిస్ట్రార్ సంతాపం వ్యక్తం చేశారు.

సౌత్‌క్యాంపస్ విద్యార్థికి కన్నీటి వీడ్కోలు

భిక్కనూరు: కామారెడ్డి పట్టణంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సౌత్‌క్యాంపస్ విద్యార్థి ప్రీతం అంత్యక్రియలు ఆదిలాబాద్ జిల్లా సాంగ్విలో శనివారం నిర్వహించారు. అంత్యక్రియలకు సౌత్‌క్యాంపస్ విద్యార్థులతో పాటు ప్రొఫెసర్ యాలాద్రి, పీహెచ్‌డీ స్కాలర్ రాహుల్ నేతతో పాటు పలువురు అధ్యాపకులు తరలివెళ్లారు. సాంగ్విలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న మృతుడు ప్రీతం కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



సోయా పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

డొంకేశ్వర్: మండలంలోని దత్తాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పంటలను శనివారం పరిశీలించారు. మొక్కజొన్నలో బ్యాక్టీరియా కాండం కుళ్లు ఆశించినట్లు గుర్తించి దీని నివారణకు 35శాతం క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్ ఎకరానికి ఐదు కిలోల చొప్పున ఇసుకలో కలిపి చల్లుకోవాలని రైతులకు సూచించారు. అలాగే సోయాబీన్‌లో పల్లాకు తెగులు ఆశించిందని దీని నివారణకు క్లోరంట్రానిలిప్రోలు, తయోమితాక్జాం మిశ్రమ మందును ఎకరానికి 100మిల్లీ లీటరుతో పాటు సిలీంద్ర నాసిని ప్రొపికొనజోల్ ఎకరానికి 200 మిల్లీ లీటర్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం వరిపంటను పరిశీలించారు. వరి ఆకుల కొనలు తెల్లగా మారి పైనుంచి కిందికి ఎండిపోవడాన్ని గమనించి నివారణకు మందులను సూచించారు. ఆయిల్‌పాంలో అంతర పంటలు వేసుకునే సమయంలో వేర్లు దెబ్బతినకుండా దూరాన్ని పాటించాలని, కొమ్ము పురుగు ఉధృతిని నివారించుకోవడానికి లింగాకర్షన బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, శ్వేత, విజయ్, మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్న భవానీ, ఏఈవో గంగాధర్, రైతులు తదితరులు ఉన్నారు.

మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



గెలుపొందిన విద్యార్థులతో ప్రొఫెసర్

తెయూ(డిచ్‌పల్లి): బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు దేశ, విదేశీ కంపెనీల్లో ఉన్నత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెయూ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి, ఈవెంట్ మెంటార్ ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఐఎంబీఏ విద్యార్థులకు టీం స్పిరిట్ గేమ్స్ నిర్వహించారు. విద్యార్థులు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మైండ్‌గేమ్స్ ఆడారు. ఈవెంట్ మేనేజర్లుగా కోటూరి శ్వేత, మోతె వేల్పూర్ రసజ్ఞ, మెగావత్ లావణ్య వ్యవహరించారు. పోటీల్లో విజేతలుగా సాయికుమార్, వినీల, భాగ్యశ్రీ, తుశ్యంత్ నిలిచారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అపర్ణ, ఖైసర్, వాణి, కిరణ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద



బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు 26 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం 52 వేల క్యూసెక్కులు వచ్చిన వరద శనివారం ఉదయానికి 39 వేల క్యూసెక్కులకు తగ్గింది. క్రమంగా తగ్గుతూ మధ్యాహ్నానికి 19 వేల క్యూసెక్కులకు చేరింది. మళ్లీ పెరిగి 26 వేల క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి 17 వేల క్యూసెక్కులకు చేరింది. ఇలా రోజంతా తగ్గుతూ.. పెరుగుతూ వరద ప్రాజెక్ట్‌లోకి కొనసాగింది. సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 462, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం రాత్రికి ప్రాజెక్ట్‌లో 1079.30(43 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి


- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం చిట్ల ప్రమీల జీవన్‌రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులకు విద్యాస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లితండ్రులు సైతం తమ పిల్లలపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. చదువుతోనే ఉన్నతస్థాయికి ఎదుగుతామని అన్నారు. అనంతరం పదోతరగతిలో ప్రతిభ కనబర్చిన 13మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు మెడల్స్, స్ఫూర్తి పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం, ఎంపీడీవో సాయిరాం, హెచ్ఎం లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగారంలో చిరుత సంచారం



నిజామాబాద్‌నాగారం: నగర శివారులోని నాగారంలో శనివారం మధ్యాహ్నం చిరుత కనిపించడం కలకలం రేపింది. డంపింగ్‌యార్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ బండరాయిపై చిరుతను గుర్తించిన స్థానికులు ఫొటోలు, వీడియోలు తీశారు. అనంతరం ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు చిరుత తిరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుత అటవీ ప్రాంతంలోనే ఉందని నివాస ప్రాంతాల్లోకి రాలేదని ఫారెస్ట్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్ తెలిపారు. ప్రజలు చిరుత ఉన్న ప్రాంతం వైపు వెళ్లొద్దని సూచించారు.

చెరువులపై హక్కులు గంగపుత్రులకే కల్పించాలి

- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జిల్లా నాయకులు



డొంకేశ్వర్: చెరువులపై పూర్తి హక్కులను గంగపుత్రులకే కల్పించాలని జిల్లా గంగపుత్ర సంఘం నాయకులు రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు విన్నవించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి సన్మానించి వినతిపత్రం అందజేశారు. అనంతరం గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లి వద్ద చేపల హోల్‌సేల్ మార్కెట్‌ను నిర్మించడానికి టెండర్లు పిలువాలని కోరారు. గంగపుత్రులు ఉన్న చోట సొసైటీల్లో ఇతరులకు అవకాశం కల్పించవద్దని, బీసీ-ఏలో ఇతర కులాలను చేర్చకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గంగపుత్ర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లికొండ అన్నయ్య, ప్రధానకార్యదర్శి బాల గంగాధర్, నాయకులు బట్టు నరేందర్, రవి, ఆనంద్, మాడవేడి వినోద్‌కుమార్, సుదీర్, సాయిలు తదితరులు ఉన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

సుభాష్‌నగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీన రద్దు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం ప్రారంభం నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాల్సి ఉన్నందున ప్రజావాణిని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 12వ తేదీ నుంచి ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో వేర్వేరు కారణాలతో ముగ్గురు శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. భూతగాదాలతో ఒకరు, భార్య మృతికి మనస్తాపంతో మరొకరు, భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాల నేపథ్యంలో..



సత్యంరెడ్డి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు

కామారెడ్డిక్రైం: భూతగాదాల నేపథ్యంలో ఒకరు ఆత్మహత్య చేసుకోగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఏదుల్ల రవీందర్ రెడ్డి(45) తనకు వారసత్వంగా వచ్చిన రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లత, ఓ కుమార్తె ఉన్నారు. సదరు భూమి రికార్డులు మాత్రం అతని పెదనాన్న సత్యం రెడ్డి పేరు మీద ఉన్నాయి. తన పేరు మీద పట్టా చేయించాలని చాలా సార్లు వారి మధ్య గొడవలు జరిగేవి. ఇటీవల పలుసార్లు గొడవలు జరిగి పోలీసు స్టేషన్ల వరకు వెళ్లాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు శుక్రవారం రాత్రి పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. సత్యంరెడ్డి ఇంటి ఎదుట బాధిత కుటుంబీకులు మృతదేహాన్ని ఉంచి కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. పోలీసులు కలుగజేసుకుని వారిని సముదాయించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

భార్య మృతికి మనస్తాపంతో మరొకరు..

లింగంపేట: భార్య మృతికి మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శెట్పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల శంకరయ్య(56) భార్య ఎనిమిదేళ్ల క్రితం పాముకాటుతో మృతి చెందింది. దీంతో నాటి నుంచి తీవ్ర మనస్తాపంతో గురయ్యాడు. ఐదేళ్ల క్రితం కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగాడు. హైదరాబాద్‌లో ఉంటున్న శంకరయ్య కుమారుడు అరవింద్ అదే రోజు సాయంత్రం ఇంటికి రాగా అపస్మారకస్థితిలో ఉన్న తండ్రిని చూసి వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని..

రెంజల్: భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సాటాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన బొంబాయి శైలజ(30) మండలంలోని సాటాపూర్‌లో శుక్రవారం రాత్రి ఎలుకల మందు కొనుగోలు చేసి సేవించినట్లు పేర్కొన్నారు. అపస్మారక స్థితిలోకి చేరుకుని అక్కడే కిరాణషాపు మెట్లపై పడిపోయినట్లు వివరించారు. శనివారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. భర్త సంజీవ్ మండలంలోని కందకుర్తికి చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నట్లు తెలుసుకున్న శైలజ రుద్రూర్ నుంచి కందకుర్తికి చేరుకుని భర్తను నిలదీయగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. భర్త బెదిరించడంతో మనస్తాపానికి గురైన ఆమె సాటాపూర్‌లో ఎలుకల మందు కొనుగోలు చేసి సేవించినట్లు వివరించారు. శైలజ అన్న గంగాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

- నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు

బాన్సువాడ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడుతుండగా గమనించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ల చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం శివారులోని పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైర్లను చోరీ చేసినట్లు రైతు మంద నారాయణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 2న మధ్యాహ్నం 12గంటల తాను పొలం వద్ద ఉన్నానని, శనివారం ఉదయం పొలానికి నీరు పెడదామని బోరు వేయగా ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి ఉండటాన్ని గుర్తించారు. అందులో కాపర్ వైర్లను దుండగులు దొంగిలించినట్లు గుర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ పేర్కొన్నారు.

కుంటలో పడి ఒకరి మృతి

బోధన్‌రూరల్: ప్రమాదవశాత్తు కుంటలో పడి ఒకరు మృతి చెందిన ఘటన బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బి రాములు (43) శనివారం ఉదయం గ్రామ శివారులోని చెరువు కుంటలో బురదతో ఉన్న కాళ్లు చేతులను కడుక్కునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెరువులో పడి మరొకరు..

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని భజన్ చెరువులో పడి సాకలి సాయిలు(50) మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. శనివారం ఉదయం చెరువు కట్టపై ఉన్న గంగమ్మ గుడి సమీపంలో మృతుడి దుస్తులు, చెప్పులు ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జాలర్ల సహాయంతో సాయిలు మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆత్మహత్యనా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ముస్కాన్'లో 74 మందికి రక్షణ

- సీపీ కల్మేశ్వర్
- ఐదు కేసులు నమోదు

ఖలీల్‌వాడి: జిల్లా వ్యాప్తంగా జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించామని, వెట్టిచాకిరి చేస్తున్న 74 మందికి విముక్తి కలిగించామని సీపీ కల్మేశ్వర్ శనివారం పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ డివిజన్‌లలో 18 ఏళ్ల లోపు పనిచేస్తున్న 74 మంది చిన్నారులను ఈ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా పట్టుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ సబ్ డివిజన్‌లో 26, ఆర్మూర్ సబ్ డివిజన్‌లో 15, బోధన్ సబ్ డివిజన్‌లో 33 మొత్తం 74 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) వారికి అప్పగించామని, తల్లిదండ్రులు ఉన్న పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, వారి ఆదేశాల మేరకు వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం బాలకార్మికులతో పనిచేయిస్తున్న నగరంలోని నాలుగో టౌన్ పీఎస్, డిచ్‌పల్లి, ఆర్మూర్, బాల్కొండ, వర్ని పీఎస్‌లో ఒక్కొక్కరిపై కేసు నమోదు చేశామన్నారు. అంతేకాకుండా తప్పిపోయిన పిల్లల వివరాలను 'దర్పన్ యాప్ లో' నమోదు చేసి వారి అడ్రస్‌లను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

తల్లితో గొడవపడి రైలులో కామారెడ్డికి..



కామారెడ్డి క్రైం: మతిస్థిమితం సరిగా లేని ఓ యువతిని కామారెడ్డి రైల్వే పోలీసులు వారి కుటుంబానికి శనివారం అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా నాచారంకు చెందిన భాగ్యరేఖకు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. తల్లి జ్యోతితో చిన్న గొడవ కావడంతో యువతి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైలు ఎక్కేసింది. కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్లాట్ ఫాంపై శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపించడంతో రైల్వే పోలీసులు ఆమెను సఖి కేంద్రానికి అప్పగించారు. ఆమె దగ్గరున్న సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. శనివారం తల్లి జ్యోతితో పాటు కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని సఖి కేంద్రానికి రాగా అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం రైల్వే ఎస్సై తావూ నాయక్ సమక్షంలో యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మొరం టిప్పర్ సీజ్

వర్ని: అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు రుద్రూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు శనివారం పేర్కొన్నారు. మండలంలోని రాయపూర్ క్యాంప్ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

అటవీ భూమి కోసం రెండు గ్రామాల మధ్య ఘర్షణ



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో

ఇందల్వాయి: మండలంలోని గౌరారం గ్రామ సౌత్ బీట్‌లో 425 కంపార్ట్‌మెంట్‌లో ఉన్న అటవీ భూమి విషయంలో గౌరారం గ్రామస్తులు, గుట్టకింది తండాకి చెందిన పలువురు గిరిజనుల మధ్య శనివారం వివాదం తలెత్తింది. గిరిజనులు అక్రమంగా అటవీ భూమిలో ఉన్న చెట్లు నరికి సాగుకు యత్నిస్తూ తమ పశువులను మేతకు రానివ్వడం లేదని అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చే సరికి ఇరువురు వాగ్వాదానికి దిగడంతో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం నలుగురు గిరిజన మహిళలను అధికారులు అదుపులోకి తీసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు.

ఘటనస్థలాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్వో

గొడవ సమాచారం అందుకున్న రేంజ్ అధికారి రవిమోహన్ భట్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాల వారిని వారి వారి గ్రామాలకు పంపించారు. అనంతరం ఆయన గౌరారం వీడీసీ సభ్యులతో మాట్లాడారు. పోడు పట్టాలకు మించి ఎవరు అటవీ భూములను ఆక్రమించవద్దని సూచించారు. గిరిజనులు అటవీ భూమిని ఆక్రమించడం నేరమని, భూమి ఆక్రమణకు గురి కాకుండా కందకాలు తవ్వించారు. పోడు పట్టాలను అడ్డుపెట్టుకొని గిరిజనులు వందల ఎకరాల అటవీ భూమిని ఆక్రమిస్తున్నారని గౌరారం వాసులు ఎఫ్ఆర్‌వోకి వివరించారు. అనంతరం అదుపులోకి తీసుకున్న గిరిజన మహిళలకు అటవీ చట్టాల గురించి వివరించి విడిచిపెట్టినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.